సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 31 । జనవరి । 2025



మేల్కొనకపోతే కటకటే...

జిల్లాలోని వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీల్లో ప్రస్తుతం తాగునీటి సరఫరా సాఫీగానే సాగుతున్నా వేసవిలో ఇక్కట్లు ఎదురయ్యే అవకాశముంది. 8లో



మెరుగ్గా అంగన్‌వాడీల నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మరింత మెరుగయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 16°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం మధ్యాహ్న ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి. సాయంత్రం తర్వాత వాతావరణం క్రమంగా చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

మత్స్య రంగాన్ని అగ్రభాగాన నిలపాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీన్ సుగుణ

కూసుమంచి: మత్స్య రైతులు అధునాతన విధానాలను అవలంబిస్తూ మత్స్య రంగాన్ని అన్నింట్లో అగ్రభాగానికి చేర్చాలని ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం డీన్, రీసెర్చ్ హెడ్ తుమ్మల సుగుణ సూచించారు. పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, వనపర్తి, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల మత్స్య రైతులకు 'బయో ఫ్లాక్' విధానంపై ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. ఈ సమావేశంలో పాల్గొన్న సుగుణ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశాక మాట్లాడారు. మత్స్య పెంపకంలో అనుభవానికి కొత్త పద్ధతులు తోడైతే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. బయోఫ్లాక్ విధానంలో చేపలు పెంచడం ఎంతో మెరుగని తెలిపారు. మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్ రెడ్డి, శాస్త్రవేత్తలు రవీందర్, శాంతన్న, నాగరాజు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకే శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడం, వారిలో భయాన్ని పోగొట్టేలా బోధించేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మం డైట్‌లో 'కెరీర్ కౌన్సెలింగ్ అండ్ గైడెన్స్' పేరిట ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన శిక్షణను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పరీక్షలంటే విద్యార్థుల్లో భయం పోగొట్టడంతో పాటు మెరుగైన ఫలితాల సాధన, ప్రతినిత్యం పాఠశాలకు హాజరయ్యేలా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అలాగే, దురలవాట్ల జోలికి వెళ్లకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, ఏఎంఓ రవికుమార్, రిసోర్స్ పర్సన్లు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, సోమలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కైైదులు, ఎర్రమ్రెక్ల శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళా న్యాయవాదుల క్రీడాపోటీలు

ఖమ్మం లీగల్: రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాదుల క్రీడా పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. తాళ్లూరి సహస్ చౌదరి మెమోరియల్ ట్రస్ట్, తాళ్లూరు దిలీప్ ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఈ పోటీలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా న్యాయవాదులు హాజరుకానున్నారని నిర్వాహకులు బి.తిరుమలరావు, దిరిశాల కృష్ణారావు, పసుపులేటి శ్రీనివాస్, తాళ్లూరి దిలీప్, రావుల వెంకట్ తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ ట్రాన్సిట్ క్యాంప్‌నకు భూమి



సీఆర్‌పీఎఫ్, జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో సీఆర్‌పీఎఫ్ అధికారులు ఏర్పాటుచేయనున్న ట్రాన్సిట్ క్యాంప్‌నకు 1.5 ఎకరాల భూమి కేటాయిస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శిక్షణతో పాటు ఇతర సమయాల్లో సిబ్బందికి తాత్కాలిక వసతి కల్పించేలా ఈ క్యాంప్ ఏర్పాటుచేయనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు భూకేటాయింపు ఉత్తర్వుల కాపీని కలెక్టరేట్‌లో 141 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ నితీష్ ఠాకూర్‌కు కలెక్టర్ అందజేశారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

మున్నేటికి అడ్డుగోడ..



రామన్నపేట వద్ద మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

రిటైనింగ్ వాల్ వివరాలు..	
నిర్మాణ వ్యయం	రూ.690 కోట్లు
నిడివి (రెండు వైపులా)	17 కిలోమీటర్లు
ఎత్తు, వెడల్పు (గరిష్టంగా)	45 అడుగులు, 18 అడుగులు
ఎత్తు, వెడల్పు (కనిష్టంగా)	24 అడుగులు, 3 అడుగులు
భూ సేకరణ	234.20 ఎకరాలు
తొలగించాల్సిన ఇళ్లు	28

చకచకా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

- ముంపును శాశ్వతంగా అరికట్టేలా నిర్మాణం
- 2026 మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం నగరం, రూరల్ మండలాలకు మున్నేటి ముంపు తప్పనుంది. గత ఏడాది ఆగస్టు 31నుంచి సెప్టెంబర్ 3వరకు చూపిన వరద ప్రవాహం పరీవాహక కాలనీలను హడలెత్తించింది. దీంతో ఉపద్రవాన్ని శాశ్వతంగా తప్పించేందుకు గత ప్రభుత్వం రిటైనింగ్ వాల్‌ను మంజూరు చేసింది. రూ.690 కోట్లతో చేపడుతున్న రిటైనింగ్(ప్రొటెక్షన్) వాల్ నిర్మాణ పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. ఖమ్మం నగరం, రూరల్ మండలాల్లో రెండు వైపులా 17 కి.మీ. రక్షణ గోడ నిర్మాణాన్ని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

ముంపుతో కకావికలమై..

గత ఏడాది సెప్టెంబర్‌లో మున్నేటికి 40 అడుగుల మేర వరద రావడంతో ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలంలోని లోతట్టు ప్రాంతాలు నిండా మునిగాయి. మున్నేటికి ఇరువైపులా సుమారు 50కి పైగా కాలనీలు జలమయం కాగా వేలాది ఇళ్లలో సామగ్రిని నష్టపోయారు. దీంతో సుమారు 10 వేల మంది వారం పాటు పునరావాస కేంద్రాల్లో ఉండాల్సి వచ్చింది. అలాగే, పలువురి ఇంటి గోడలు, ఇతర కట్టడాలు కూలిపోయాయి. ఆ సమయాన రిటైనింగ్ వాల్ ఉంటే నష్టతీవ్రత తగ్గేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే, అంతకు ముందే మున్నేటికి ఇరువైపులా ఖమ్మం నగరం, రూరల్ మండలాల్లో రిటైనింగ్ వాల్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. ఇందుకు సంబంధించి బీఆర్‌ఎస్ హయాంలో జీఓ జారీ చేయడమే కాక రూ.690 కోట్ల నిధులూ మంజూరయ్యాయి.

ప్రైవేట్ భూమి 173.29 ఎకరాలు

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 234.20 ఎకరాలు సేకరించాలని సర్వే ద్వారా గుర్తించారు. ఇందులో ఖమ్మం నగర పరిధిలో 114.11 ఎకరాలు, ఖమ్మం రూరల్ మండలంలో 120.09 ఎకరాలు సేకరించాలి. ఈ భూమిలో 60.31 ఎకరాల ప్రభుత్వ భూమి కాగా, ప్రైవేట్ వ్యక్తుల నుంచి 173.29 ఎకరాలు సేకరించాల్సి వస్తోంది. తొలుత ప్రభుత్వ భూమి ఉన్న చోట గోడ నిర్మాణ పనులు చేపట్టగా.. పట్టా భూమి సేకరణకు యజమానులతో అధికారులు చర్చిస్తున్నారు. భూనిర్వాసితులకు ఖమ్మం రూరల్ మండలం సమీపంలో ప్రభుత్వ భూమి ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. అలాగే బఫర్ జోన్‌లో నిర్మించిన 28ఇళ్లను తొలగించి వీరికి ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే అవకాశముంది.

వరదకు చెక్ పెట్టేలా..

మున్నేరు ముంపు నుంచి పరీవాహకాన్ని రక్షించేలా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఖమ్మం నగరం వైపు 8.5 కి.మీ. ఖమ్మం రూరల్ వైపు 8.5 కిలోమీటర్లు.. మొత్తంగా 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మిస్తారు. ఖమ్మంరూరల్ మండలంలో గోళ్లపాడు నుంచి గుదిమళ్ల వరకు, నగరంలో మల్లెమడుగు నుంచి ప్రకాశ్‌నగర్ వరకు గోడ నిర్మాణం ఉంటుంది. ఒక్కో వైపు కనిష్టంగా 24 అడుగుల నుంచి 45 అడుగుల వరకు నిర్మించే గోడ మున్నేటిపై కాల్వొడ్డు సమీపాన గరిష్టంగా 45 అడుగుల వరకు ఎత్తు ఉంటుంది. ఇక సగటున 20 అడుగుల నుంచి 3 అడుగుల మేర వెడల్పుతో నిర్మిస్తారు. గత ఏడాది వరదల సమయాన మున్నేరు నుంచి 3.50 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు పోగా, అప్పటి ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకుని రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారు. వాల్‌కి రెండు వైపులా పక్క నుంచి రోడ్డు, సమీప కాలనీల్లో మురుగునీరు ముందుకు సాగేలా డ్రెయినేజీలు కూడా నిర్మించనున్నారు.

ఏడాదిలో పూర్తి చేయాలని..

మున్నేటి వరద గత ఏడాది అతలాకుతలం చేయగా, మళ్లీ ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. గత సీజన్‌లో వరద తాలుకా ప్రభావాన్ని స్థానికులు ఇంకా మరిచిపోలేకపోతున్నారు. దీంతో వచ్చే ఏడాది(2026) మార్చి నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో పలుమార్లు సమీక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కూడా నీటి పారుదల, రెవెన్యూ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించడమే కాక తరచూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పనుల్లో వేగం పెరిగేలా సూచనలు చేస్తున్నారు.

పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పర్యాటక ప్రాంతాల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

- ఖమ్మం బ్రాండ్‌తో లోగో, ట్యాగ్ లైన్
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన నేలకొండపల్లి బౌద్ధస్తూపం, పాలేరు రిజర్వాయర్, ఖమ్మం ఖిల్లా, పులిగుండాల ప్రాజెక్ట్, వెలుగుమట్ల అర్బన్ పార్క్ తదితర పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ వద్ద 40 ఫీట్ల రోడ్డు అభివృద్ధి చేయడం ద్వారా వాహనాల రాకపోకలు సులువవుతాయని చెప్పారు. అలాగే, పులిగుండాలలో క్యాంప్ సైట్ ఏర్పాటుచేయాలని సూచించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, ఎకో టూరిజంకు బ్రాండింగ్ వచ్చేలా ప్రత్యేక లోగో, ట్యాగ్ లైన్ తయారు చేయించాలని చెప్పారు. అనంతరం జమలాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అటవీ పార్క్, కాటేజీ అభివృద్ధి పనులు, ఖమ్మం ఖిల్లా వద్ద రోప్ వే నిర్మాణం, పార్కింగ్ ఏరియా గుర్తింపుపై సూచనలు చేశారు. అలాగే, జాఫర్ బావి వద్ద మార్చిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు.

12లోగా నీటి వనరుల ఆక్రమణలపై నివేదిక

జిల్లాలోని నీటి వనరుల ఆక్రమణలను గుర్తించి ఫిబ్రవరి 12లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్ విభాగాల వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలిస్తే వనరుల ఆక్రమణలను గుర్తించవచ్చన్నారు. కాగా, మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్‌ను ప్రతీ 45 మీటర్లకు ఒక భాగంగా విభజించుకుని పనులు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ భూమిపోగా ప్రైవేట్ భూమి సేకరణలో వేగం పెంచాలని చెప్పారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ నర్సింహారావు, జిల్లా టూరిజం అధికారి సుమన్‌చక్రవర్తి, జల వనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, సర్వే అండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రామదాసు మందిరం ఆవరణే ఇది...

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడైన కంచర్ల గోపన్న(రామదాసు) స్వస్థలం నేలకొండపల్లిలో ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి వేదిక లేదని ఇటీవల రూ.లక్షలు వెచ్చించి రామదాసు ధ్యాన మందిరం ఆవరణలోనే ఆడిటోరియం నిర్వహించారు. ఇందులో శనివారం నుంచి మూడు రోజుల పాటు భాషా సాంస్కృతిక శాఖ, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, శ్రీ భక్తరామదాసు విద్వత్ కళాపీఠం, అధికార యంత్రాంగం ఆధ్వర్యాన రామదాసు జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. కానీ ఇప్పటివరకు అటు ధ్యాన మందిరంలో, ఇటు ఆడిటోరియంలో ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీనికి తోడు ఆడిటోరియంపై పర్యవేక్షణ లేక గొర్రెలు, మేకలను పెంపకందారులు మేపుతున్నారు. ఇక్కడి మందిరాన్ని భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకున్నా ఏర్పాట్లపై పట్టింపు లేనట్లు వ్యవహరించడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆడిటోరియం ఆవరణలో గడ్డి మేస్తున్న జీవాలు

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ

- సైబర్ మోసాలపై విస్తృత అవగాహన
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: నేరాలను నియంత్రించేలా విజిబుల్ పోలీసింగ్‌కు తోడు నిఘా మరింత పటిష్ట పరచాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన సమావేశంలో పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల నమోదు, దర్యాప్తు, పరిష్కారం, సొత్తు రికవరీపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరగాలంటే కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఘటనాస్థలిలో సాక్ష్యాధారాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో త్వరగా చార్జిషీట్లు దాఖలు చేయాలని, అలవాటుగా నేరాలు చేసే వారిపై హిస్టరీ షీట్లు తెరిచి సరిహద్దు జిల్లాల అధికారులతో సమాచారాన్ని పంచుకుంటే కట్టడి సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే, చోరీల నియంత్రణ, సొత్తు రికవరీపై పోలీస్ అధికారులు పెట్రోలింగ్ ముమ్మరం చేస్తూ రాత్రి వేళ గస్తీ పెంచాలని తెలిపారు. అంతేకాక బస్టాండ్లు, స్టేషన్ల వంటి రద్దీ ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని సూచించారు.

ప్రతీ గ్రామంలో అవగాహన

అధికారులు తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సైబర్ నేరాల తీవ్రత, సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూనే మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సీపీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి అవసరమైన చోట బారికేడ్లు, కోన్లు ఏర్పాటు చేయాలని, ప్రతీరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీ చేపట్టాలని సూచించారు. అలాగే, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్ సాయి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రవి, శ్రీనివాసులు, సర్వర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణకు సిద్ధం



విస్తరణకు ప్రతిపాదించిన రఘునాథపాలెం బైపాస్‌రోడ్డు

- విస్తరణకు తోడు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు రూ.వెయ్యి కోట్లు
- ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు

ఖమ్మంఅర్బన్: జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ, వరదల ప్రభావంతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుకు అధికారులు రూ.వెయ్యి కోట్లతో అంచనాలు రూపొందించారు. ప్రధాన గ్రామాలను కలిపే లింక్ రోడ్లలో రద్దీ ఎక్కువగా ఉన్న వాటిని గుర్తించగా, సింగిల్ రోడ్లను రెండు వరుసలుగా, రెండు వరుసల రోడ్లను నాలుగు వరుసగా విస్తరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయగా, త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నారు. వీటికి తోడు గత ఏడాది వరదలతో దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జిల మరమ్మతు పనులను కూడా ప్రతిపాదనల్లో పొందుపరిచారు.

అత్యధికంగా పాలేరులో...

వరదల ప్రభావంతో అత్యధికంగా పాలేరు నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. దీంతో 45 పనులకు రూ.300 కోట్లకు పైగా అవసరమని అంచనాలు రూపొందించినట్లు తెలిసింది. ఖమ్మం నియోజకవర్గంలో ఏడు పనులకు రూ.150 కోట్లు అవసరమని గుర్తించారు. ఇందులో ప్రధానంగా ఖమ్మం-వైరా ప్రధాన రహదారి ఎస్‌ఆర్ గార్డెన్స్ నుండి రఘునాథపాలెం బైపాస్ వరకు ఉన్న రెండు లేన్ల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. ఈ రహదారిలోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మించనుండడంతో భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా విస్తరించనున్నారు. అలాగే, రఘునాథపాలెం వద్ద జింకల తండా రోడ్డు సైతం ప్రస్తుతం రెండు వరుసలతో ఉండగా నాలుగు లేన్లుగా విస్తరిస్తారు.

ఇవికాక వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోనూ పలు రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా దశల వారీగా నిధులు మంజూరైతే పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

మనిషికి రోజుకు 100లీటర్లు...

- వేసవిలో నీటి సరఫరాకు ప్రణాళిక
- రేపటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్



ఖమ్మంవన్‌టౌన్: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు మిషన్ భగీరథ అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాలతో గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించనున్నారు. ఇందుకోసం శనివారం నుంచి ఫిబ్రవరి 10 తేదీ వరకు జిల్లా, డివిజన్, మండల పంచాయతీ అధికారులు, గ్రామ కార్యదర్శులు, సీఈ మొదలు ఏఈఈల వరకు గ్రామాల బాట పట్టనున్నారు. గత వేసవిలో సమస్య ఎదురైన గ్రామాల్లోనే కాక అన్నిచోట్ల నీటి పంపులు, పైపులను తనిఖీ చేస్తారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి వచ్చే ఐదు నెలల పాటు నీటి సరఫరా సాగేలా ప్రణాళిక రూపొందించనున్నారు.

ప్రత్యేక కమిటీలు

తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న అవాంతరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలకు తోడు అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తిస్తారు. వీటిని పరిష్కరించడం ద్వారా నీటి సరఫరా ఇక్కట్లను అధిగమించనుండగా, మిషన్ భగీరథ నీటిపై నమ్మకం కలిగించేలా అవగాహన సదస్సులు సైతం నిర్వహిస్తారు. వేసవిలో ప్రతీ మనిషికి 100 లీటర్ల నీరు సరఫరా లక్ష్యంగా నిర్దేశించుకోవాలన్న మంత్రి సీతక్క ఆదేశాలతో మిషన్ భగీరథ అధికారులు కార్యాచరణ రూపొందించుకున్నారు.

ఇబ్బందులు రాకుండా ప్రణాళిక

జిల్లావ్యాప్తంగా రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గతంలో మాదిరి సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తాం. ఇందుకోసం శనివారం నుంచి 10వ తేదీ వరకు పరిశీలన చేపట్టనున్నాం.

– పుష్పలత, మిషన్ భగీరథ ఈఈ, ఖమ్మం

రోడ్డు భద్రతే ప్రధానం

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్ల సన్మానంలో అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ వాహన డ్రైవర్ రోడ్డు భద్రతా నియమావళిని పాటించడం ద్వారా ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వాహన వేగాన్ని అదుపులో ఉంచాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. అనంతరం ప్రమాద రహితంగా బస్సులు నడిపిన డ్రైవర్లను సన్మానించారు. ఖమ్మం రీజియన్‌లో మొదటి స్థానం ఖమ్మం డిపోనకు చెందిన బి.రాములు దక్కించుకోగా, ఆ తర్వాత స్థానాల్లో డి.ఆంథోని(ఖమ్మం), వి.వెంకటేశ్వర్లు(మణుగూరు) నిలిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ జీ.ఎస్.పవిత్ర, ఖమ్మం డీఎం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్లతో డీటీఓ, ఏసీపీ, ఆర్ఎం తదితరులు

క్లుప్తంగా

మధిర జీడీసీ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



రవీంద్రారెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మందడి రవీంద్రారెడ్డికి డాక్టరేట్ లభించింది. 'ఆయిల్ సీడ్స్, కల్టివేషన్ ఇన్ హైదరాబాద్ స్టేట్ యాన్ ఎనలిటికల్ స్టడీ ఫ్రమ్ 1911–1948' అంశంపై ఆయన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.దయాకర్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రకటించారు. సూర్యాపేట జిల్లా మోతే మండలం సిరికొండకు రవీంద్రారెడ్డి ప్రస్తుతం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ ప్రకటించడంతో ఆయనను గురువారం కళాశాలలో అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, అధ్యాపకులు డాక్టర్ శీలం ఇందిర, డాక్టర్ పి సుజాత, షేక్ అఫ్రోజ్, సురేష్, డాక్టర్ నిభానుపుడి సుబ్బరాజు, ఫణీంద్ర కుమార్, శ్రీనివాసరావు, అనిత, వెంకటలక్ష్మి, జ్యోతి, హారిక, శివకుమారి, మాధురి, ఉద్యోగులు అఫ్జల్, సునీల్, సత్యవతి, నాగలక్ష్మి, హరినాథ్ పాల్గొన్నారు.

మరోమారు గెలిపించండి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్ – ఖమ్మం – నల్లగొండ నియోజకవర్గం నుండి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోమారు గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు కోరారు. ఖమ్మంలో గురువారం జరిగిన సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడుతూ నర్సిరెడ్డి మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ ఉద్యమంలో నిబద్ధతతో పనిచేశారని తెలిపారు. ఆయనకు వివిధ సంఘాలు మద్దతు ఇస్తున్నందున మరోమారు గెలిపిస్తే విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడతారని చెప్పారు. అనంతరం నర్సిరెడ్డి మాట్లాడగా నాయకులు చావా దుర్గాభవాని, బి.రాజు, పారుపల్లి నాగేశ్వరరావు, బి.రాజు, టి.వెంగళరావు, ఏ.వీ.నాగేశ్వరరావు, మురళీమోహన్, ఎం.వెంకటేశ్వర్లు, హరిలాల్, బుర్రి వెంకన్న, షమి, రాంబాబు, నాగిరెడ్డి, మనోహర్‌రాజు, వీరబాబు, నాగిరెడ్డి, రామాచారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్న తనకు ఒక అవకాశం ఇవ్వాలని పీఆర్‌టీయూ తెలంగాణ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపించడం ద్వారా ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

లారీడ్రైవర్ చాకచక్యం.. విద్యార్థికి తప్పిన ప్రమాదం



హైవేపై అడ్డంగా వెళ్తున్న విద్యార్థి (సర్కిల్‌లో)

నేలకొండపల్లి: ఓ లారీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో బాలుడికి ప్రమాదం తప్పింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో రెండు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు తెలుస్తుండగా వీడియోలు గురువారం వైరల్‌గా మారాయి. గ్రామానికి చెందిన ఓ విద్యార్థి సైకిల్‌పై సర్వీస్ రోడ్డు మీదుగా కోదాడ–ఖమ్మం జాతీయ రహదారిపైకి చేరుకున్నాడు. అదే సమయాన ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న లారీని గమనించలేదు. అయితే, లారీ డ్రైవర్ మాత్రం బాలుడు కనిపించగానే వేగంగా ఉన్న వాహనాన్ని అదుపు చేయడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఆ వెంటనే బాలుడు అక్కడి నుంచి వెళ్లిపోగా, వివరాలు తెలియరాలేదు. కాగా, లారీకి అడ్డంగా సైకిల్ వచ్చిన సమయంలో మరో ద్విచక్ర వాహనదారుడు సైతం రాంగ్ రూట్‌లో వెళ్తున్న దృశ్యం సీసీ కెమెరాలో నమోదైంది.

కంకర టిప్పర్ బోల్తా

కూసుమంచి: మండలంలోని కేశ్వాపురంలో కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ గురువారం బోల్తా కొట్టింది. జాతీయ రహదారి పనులకు కంకర తీసుకెళ్తుండగా టిప్పర్ డ్రైవర్ ఆటోను తప్పించే క్రమాన వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈఘటనలో వాహనం దెబ్బతినగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అయితే, ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,100	7,100
మిర్చి	14,000	5,800
మిర్చి తాలు	6,750	5,800
ఏసీ మిర్చి	7,000	6,000
పత్తి	7,200	5,100

– ఖమ్మం వ్యవసాయం

మేల్కొనకపోతే కటకటే..

- వైరా రిజర్వాయర్‌లో తగ్గుతున్న నీటిమట్టం
- తాగునీటి ప్రత్యామ్నాయాలపై ముందుచూపు కరువు





వైరా రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీరు, (ఇన్‌సెట్) పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఫోకస్

వైరా: వేసవి సమీపిస్తున్న నేపథ్యాన వైరా మున్సిపాలిటీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించకపోతే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు. మరోవైపు ప్రధాన ఆధారమైన వైరా రిజర్వాయర్‌లో నీటి మట్టం రోజురోజుకు తగ్గుతోంది. వైరా మున్సిపాలిటీ పరిధిలో 37వేల జనాభా ఉండగా రిజర్వాయర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే, ప్రస్తుతం రిజర్వాయర్ నుంచి అటు తాగు, ఇటు సాగు అవసరాలకు సరఫరా చేస్తుండడంతో నీటిమట్టం 13 అడుగులకు పడిపోయింది.

సరిపడా ట్యాంక్‌లు లేక...

మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాకు మిషన్ భగీరథ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అయితే, తొలినాళ్లలో జనాభాకు అనుగుణంగా తాగునీటి ట్యాంకులు నిర్మించగా, జనాభా పెరిగినా అదనపు నిర్మాణాలు జరగకపోవడంతో ఏటా వేసవిలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలైన లాలాపురం, దిద్దుపూడి, పల్లిపాడు సోమవరం, గండగలపాడుతో పాటు వైరాలోని బీసీ కాలనీ ప్రాంతాలలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంటోంది.

పెరిగిన జనాభా

వైరా మున్సిపాలిటీ 2018లో ఏర్పడగా 2011 లెక్కల ప్రకారం 33 వేల జనాభా ఉండేది. కానీ ఇప్పుడు జనాభా 37 వేలకు పైగా చేరిందని అధికారులే చెబుతున్నారు. ప్రస్తుతం 18 ట్యాంక్‌లు ఉండగా రోజుకి 42 లక్షల లీటర్ల చొప్పున, ఒక్కొక్కరికీ 135 లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. ఇది ఇప్పుడు సరిపోతున్నా వేసవిలో పెరిగే నీటి వినియోగం కారణంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, సరిపడా నీరు సరఫరా చేయాలనుకున్నా ఆ స్థాయిలో ట్యాంక్‌లు లేకపోవడం అవరోధంగా మారుతుంది. మరోపక్క రిజర్వాయర్‌లో రోజురోజుకు నీటి మట్టం పడిపోతుండడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

అమృత్–2 ఆలస్యం

మున్సిపాలిటీ పరిధిలో అమృత్–2 పథకం ద్వారా అధికారులు తాగునీటి ట్యాంక్‌ల నిర్మాణానికి సిద్ధమయ్యారు. అయితే, రకరకాల కారణాలతో నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీనికి తోడు మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల ఎయిర్ వాల్వ్‌లు, పైపులైన్ల లీకేజీలతో నీరు వృథా అవుతుంది. ఎప్పటికప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నా శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం....



మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఇక్కట్లు రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఏ ప్రాంతంలోనైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో కానీ మా సిబ్బందికి కానీ ఫిర్యాదు చేయొచ్చు. ఎక్కడ కూడా వాల్వ్‌లు, పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా చూస్తున్నాం.

– చింతల వేణు, కమిషనర్

ఆ కాలనీలకు ట్యాంకర్లే దిక్కు..

- వేసవి వస్తే పెరగనున్న అవస్థలు
- సత్తుపల్లి మున్సిపల్‌లో పైప్‌లైన్ విస్తరణలో జాప్యం





జంగాల కాలనీలో నీళ్ల కోసం ఇళ్లముందు డ్రమ్ములు, (ఇన్‌సెట్) పని చేయని చేతిపంపు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధి జంగాల కాలనీ, జవహర్‌నగర్ కాలనీలలో తాగునీటి పైపులైన్లు సక్రమంగా లేవు. దీంతో ఆయా కాలనీలకు ఏళ్లుగా ట్యాంకర్ల ద్వారానే నీటి సరఫరా చేస్తున్నారు. ఫలితంగా ఉదయం లేచింది మొదలు ఇళ్ల ముందు డ్రమ్ములు పెట్టుకుని ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో 50వేల జనాభా ఉండగా 115 కి.మీ. మేర పైపులైన్ ఆధారంగా 6,220 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 5.75 ఎంఎల్‌డీల నీరు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథతో పాటు 40 బోర్ల సాయంతో ఈ నీటి సరఫరా జరుగుతోంది. అయితే, ఇంకా శివారు ప్రాంతాల్లో ఇంకా ఐదు కిలోమీటర్ల మేర తాగునీటి పైపులైన్ విస్తరించాల్సి ఉంది. ఆ పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ఆయా కాలనీలకు ట్యాంకర్ల ద్వారా పంపించే నీరే దిక్కవుతోంది. ప్రస్తుతం మూడు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నా వేసవిలో నీటి వినియోగం పెరిగితే పరిస్థితి ఏమిటన్నది తెలియరావడం లేదు.

నీటి ఎద్దడి తలెత్తకుండా..



పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జంగాల కాలనీ, జవహర్ నగర్ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్ లేనందున అమృత్–2 ద్వారా పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాం. పనులు జరిగేవరకు వేసవిలో ఆయా ప్రాంతాలకు అదనంగా మరో రెండు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తాం.

– ఎం.రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

సమృద్ధిగా తాగునీరు

మధిరలో ప్రస్తుతం సాఫీగానే సరఫరా ..



తాగునీటి వనరుగా ఉన్న వైరా నది

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం ప్రజలకు సమృద్ధిగా తాగునీరు సరఫరా జరుగుతోంది. వైరా రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారానే కాక వైరా నది నుంచి పంపుహౌస్‌కు అక్కడ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు ఎక్కించి సరఫరా చేస్తున్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో 40,468 మంది జనాభా ఉన్నారు. మిషన్ భగీరథ ద్వారా వైరా రిజర్వాయర్ నుంచి తాగునీటిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ట్యాంక్‌కు ఎక్కిస్తున్నారు. అలాగే, వైరా నది వద్ద ఉన్న పంప్ హౌస్ నుంచి విద్యుత్ మోటార్ల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతోంది. మొత్తం జనాభాకు రోజుకు 5.46 మిలియన్ లీటర్ల తాగునీరు అవసరం ఉండగా ప్రస్తుతం 5.17 మిలియన్ లీటర్లు సరఫరా అవుతోంది. ఎక్కడైనా లీకేజీలు ఎదురైనా 48 గంటల్లోగా మరమ్మతులు చేస్తుండడంతో ఇప్పటివరకైతే సమస్యలు ఎదురుకావడం లేదు. అయితే, శ్రీనగర్ కాలనీ రోడ్ నెంబర్–3కి నీరు సరఫరా కావడం లేదని, టీచర్స్ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్లకు లీకేజీ ఏర్పడడానికి నాణ్యత లేకపోవడమే కారణమని చెబుతున్నారు. ఇవి కాక పలుచోట్ల ఎగువన ప్రాంతాల వారు పైపులకు నేరుగా మోటార్లు బిగించి ట్యాంకుల్లోకి నీరు ఎక్కిస్తుండడంతో దిగువ ప్రాంతాలకు సరిపడా నీరు చేరడం లేదు. ఆయా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారిస్తే తాగునీటి సరఫరా ఇక్కట్లు ఉండవని చెబుతున్నారు. కాగా, రానున్న వేసవిలోనూ తాగునీటి ఎద్దడి రాకుండా వైరా నదిలో బోర్లు వేయడంతో పాటు సబ్ మెర్సిబుల్ మోటార్ల సాయంతో ట్యాంక్‌లకు ఎక్కిస్తామని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, డీఈఈ నరేష్‌రెడ్డి తెలిపారు. కొన్ని కాలనీల్లో నూతనంగా పైప్‌లైన్లు వేయగా, త్వరలోనే ఆయా ప్రాంతాల ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇస్తామని వెల్లడించారు.

మరింత మెరుగ్గా అంగన్‌వాడీల నిర్వహణ

అదనపు కలెక్టర్ శ్రీజ



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మరింత మెరుగుపడేలా ఉద్యోగులు పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. పోషణ అభియాన్, ప్రీ స్కూల్ నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అందుతున్న సేవలు, లబ్ధిదారుల వివరాలపై సమీక్షించాక అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనితీరు సరిగ్గా లేని కేంద్రాలు, మండలాలపై అధికారులు దృష్టి సారించి టీచర్ల హాజరు, పనితీరును పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే, మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకువైద్యపరీక్షలు, పౌష్టికాహారం పంపిణీపై దృష్టి సారించేలా సూచనలు చేయాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ ఎత్తు, బరువు తక్కువ ఉన్న వారికి నిర్దేశిత అదనపు ఆహారం అందించాలని తెలిపారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతులను త్వరగా పూర్తిచేయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి కీసర రాంగోపాల్‌రెడ్డి, సీడీపీఓలు, ఏసీడీపీఓలతో పాటు సుప్రీమ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలో దరఖాస్తుల పరిష్కారం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పరిశ్రమలు స్థాపనకు టీజీ–ఐపాస్ ద్వారా అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. టీజీ–ఐపాస్, టీ–ప్రైడ్ దరఖాస్తులపై అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్ 22దరఖాస్తుల్లో 15 ఆమోదించగా, మిగతావి తిరస్కరించడం, పరిశీలిస్తున్న నేపథ్యాన వివరాలు తెలుసుకున్నారు. ఎవరివైనా దరఖాస్తులు తిరస్కరిస్తే అందుకు కారణాలపై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. టీ–ప్రైడ్ పథకం ద్వారా ఏర్పాటైన పది ఎస్సీ, ఎస్టీ యూనిట్లకు రూ.33 లక్షలకు పైగా సబ్సిడీని మంజూరు చేశామని తెలిపారు. పరిశ్రమల శాఖ జీఎం టి.సీతారాం, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు దితరులు పాల్గొన్నారు.

రైతు, కూలీల వ్యతిరేక విధానాలపై పోరాటం



సదస్సులో మాట్లాడుతున్న వెంకట్

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం రైతు, కూలీలకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విదానాలపై పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, కార్పొరేట్, మతోన్మాద శక్తుల్ని మాత్రం అక్కున చేర్చుకుంటోందని ఆరోపించారు. దేశంలో ఎక్కువ మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండగా కేంద్రం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ తగ్గిస్తోందని విమర్శించారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, నాయకులు బుర్రి ప్రసాద్, పొన్నం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వత్సవాయి జానకీరాములు తాళ్లపల్లి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరావు, రాధాకృష్ణ, తన్నీరు కృష్ణ, అర్జున్‌రావు, నాగేశ్వరరావు, నంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చింతకాని: మండలంలోని నాగులవంచ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన సీహెచ్.సంతోష్, బాలు బాలసాయి, చింతల నిఖిల్ సాయికుమార్ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బస్సును తప్పించే క్రమాన బొలేరో వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ ఘటనలో సంతోష్ కాలు విరగగా, బాలసాయి, నిఖిల్ సాయికుమార్ సైతం గాయపడడంతో 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ పైనుండి జారిపడి డ్రైవర్ మృతి



శివకుమార్ (ఫైల్)



డబ్బా కొట్టును ఢీకొట్టిన ట్రాక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ట్రాక్టర్‌తో బయటకు వెళ్తున్న డ్రైవర్ అకస్మాత్తుగా జారి కింద పడడంతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఘటన వివరాలు.... కేఎంసీ నుంచి పారిశుద్ధ్య ట్రాక్టర్‌ను డివిజన్‌కు తీసుకెళ్లేందుకు వచ్చిన డ్రైవర్ శికుమార్ కార్యాలయ సమీపంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్దకు రాగానే ట్రాక్టర్ పైనుండి కింద పడ్డాడు. దీంతో ట్రాక్టర్ నేరుగా వెళ్లి సమీపంలోని డబ్బా కొట్టును ఢీకొని ఆగిపోయింది. కాగా, డ్రైవర్‌ను స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించగా చికిత్స చేసి ఇంటికి పంపించారు. అయితే, మార్గమధ్యలోనే ఆయన అస్వస్థతకు గురి కాగా మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చేసరికి శివ మృతి చెందినట్లు వెల్లడించారు. ఈమేరకు మేయర్ పి.నీరజ, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో శివ కుటుంబానికి రూ.10 వేలు అందజేయగా, త్వరలోనే రూ.2లక్షల ఆర్థిక సాయం, శివ కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని వెల్లడించారు. కాగా, ట్రాక్టర్ డబ్బా కొట్టును ఢీకొనడంతో ధ్వంసం కాగా, అక్కడ పాల ప్యాకెట్లు వేసేందుకు వచ్చిన ఇద్దరు ప్రమాదం త్రుటిలో బయటపడ్డారు.

బీమా పరిహారం చెల్లించాలని తీర్పు

ఖమ్మం లీగల్: ఆరోగ్య బీమా తీసుకున్న వ్యక్తి చికిత్స బిల్లుతో పాటు ఖర్చులు కూడా చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత తీర్పు నిచ్చారు. గురువారం వెలువడిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన రేమళ్ల వెంకటేష్ స్టార్ హెల్త్ ఎల్లాయిడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా తన కుటుంబ సభ్యులతో కలిపి 2022లో రూ.9,522 చెల్లించి పాలసీ తీసుకున్నారు. రూ.5లక్షల పరిమితితో పాలసీ తీసుకోగా కొన్నాళ్లకు అనారోగ్యం బారిన పడిన వెంకటేష్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఈమేరకు వైద్యానికి అయిన ఖర్చు చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా వారు నిరాకరించారు. దీంతో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించగా వైద్యఖర్చులు రూ.43,100తో పాటు ఖర్చుల నిమిత్తం రూ.10వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

తాగునీటి కోసం ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న స్థానికులు

నేలకొండపల్లి: రెండేళ్లగా తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ మండలంలోని తిరుమలాపురం తండాలోని పలువురు గురువారం ఆందోళన నిర్వహించారు. ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలపగా పంచాయతీ కార్యదర్శి సురేష్ రాగానే నిలదీశారు. గ్రామంలో కొందరు మోటార్ల ద్వారా నీటిని ఎక్కువగా ట్యాంకుల్లోకి ఎక్కించుకుంటున్నారని, మరికొందరు పెద్ద పైపులు వేసుకోవడంతో తమకు నీరు అందడం లేదని ఆరోపించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గేట్‌వాల్ మారుస్తునాన పగిలిపోతుందని తెలిపారు. త్వరలోనే మరమ్మతు చేయించడమే కాక మోటార్లు, పెద్దపైపులను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కమదన ప్రవీణ్, తేజావత్ అరుణ, లినీమా, దేవ్లా, ఉపేందర్, సాయి, భద్రు తదితరులు పాల్గొన్నారు.

ఆబోతు నేరుగా ఆస్పత్రికి..!

చికిత్స అనంతరం గ్రామానికి చేర్చిన స్థానికులు



ఆబోతుకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి సృజన

సత్తుపల్లి/పెనుబల్లి: ప్లాస్టిక్ వ్యర్థాలు మింగడంతో అస్వస్థతకు గురైన ఓ ఆబోతు నేరుగా ఆస్పత్రికి వచ్చింది! రెండు రోజుల పాటు కదలకుండా ఉండడంతో అనుమానం వచ్చిన సిబ్బంది పరీక్షించగా అస్వస్థత విషయం బయటపడడంతో చికిత్స చేశారు. పెనుబల్లి మండలం కారాయిగూడెంలోని కృష్ణుడి గుడి వద్ద 14ఏళ్ల వయస్సు ఉన్న ఆబోతు కొన్నేళ్లుగా ఉంటోంది. అది కారాయిగూడెం నుంచి తొమ్మిది కి.మీ. దూరాన ఉన్న పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి ఆవరణకు బుధవారం చేరుకోగా అక్కడే మూలుగుతూ ఉండిపోయింది. గడ్డి వేసినా తినకపోగా కదలకపోవడంతో అనుమానం వచ్చిన 108 సిబ్బంది గురువారం పశువైద్య అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పశువైద్యాధికారి సృజన చేరుకుని పరీక్షించగా ప్లాస్టిక్ వ్యర్థాలు తినడంతో అస్వస్థతకు గురైనట్లు తేలింది. ఈమేరకు చికిత్స చేశాక కారాయిగూడెం వాసులకు సమాచారం ఇవ్వడంతో వాహనంలో ఆబోతును తీసుకెళ్లారు.

భూమి పంచాయితీలో కేసుల నమోదు

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్‌లో రెండు వర్గాలు ఘర్షణ పడగా పరస్పరం అందిన ఫిర్యాదులతో ఇరువర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. పువ్వాడనగర్‌లో భూమి తాము కొనుగోలు చేశామని మందా రామారావు, గోపి, రాధ శుభ్రం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే అక్కడకు చేరుకున్న బి.దూప్లె అడ్డుకోగా ఘర్షణ చోటు చేసుకుంది. తనపై దాడి చేశారని దూప్లే, కొనుగోలు చేసిన భూమిని శుభ్రం చేసుకుంటుంటే దూప్లే, హల్యా అడ్డుకున్నారని రామారావు బృందం చేసిన ఫిర్యాదుతో కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కలిగిన ఆరుగురి అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని సీక్వెల్ రిసార్ట్స్ రోడ్డులో గంజాయి విక్రయిస్తుండడంతో సేవిస్తున్న ఆరుగురిని వన్ టౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. స్థానికులు సమాచారంతో పోలీసులు తనిఖీ చేయగా 450గ్రాముల గంజాయితో ఆరుగురు పట్టుబడ్డారు. వీరిలో ఇద్దరు మైనర్లు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ వెల్లడించారు.

డీసీసీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో గురువారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్‌తో పాటు దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొక్కా శేఖర్‌గౌడ్, హుస్సేన్, దొడ్డా అశోక్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, పాలకుర్తి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సీపీఐ కార్పొరేటర్

ఖమ్మం 19వ డివిజన్ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ సీపీఐకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పలువురు అనుచరులతో కలిసి వచ్చిన ఆయనకు గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనకు ఆకర్షితుడినై చేరానని తెలిపారు. ఇంకా సజ్జా దుర్గా, శ్యామ్, గణేష్, శీలం అజయ్, రాములు, వెంకట్, శివ, రాజగోపాల్, లక్కీ, కొండల్‌రావు, జంపన్న తదితరులు పార్టీలో చేరారు.